# సోహమ్

**నా** భార్య పొరబడిందనుకున్నా, నా మిత్రులూ, దగ్గిర బంధువులూ కూడా పొరపాటు పడ్డారని ఎలా అనుకోను? నేను మామూలు మనిషిని కాను. నాలో ఏదీ మానసిక వ్యాధి ఉన్నది. నాలో అతిశయమో, అహంకారమో, ఆత్మ విశ్వాసమో, దర్పమో – ఏదో లేదు. "నీకు వెన్నముకలేదు" అన్నారు కొందరు ఇంగ్లీషులో. నా భార్య ఉద్దేశం నాకసలు బుద్ధే లేదని.

నాలో లేనిదేమిటో చెప్పలేను గాని ఉన్నదేదో నాకు తెలుసు. నేను అనేక మందిలో సందర్భాన్ని బట్టి గొప్పతనం చూస్తాను. సెలూన్‌కు వెళ్లినప్పుడు మంగలివాణ్ని, బసెక్కినప్పుడు డ్రైవర్నీ, రిపేరు చెయ్యటానికి వచ్చిన ఎలెక్ట్రీషియన్‌నీ, ఏ అధికారినన్నా చూడబోయినప్పుడు ఆఫీసు బాయ్‌నీ, గొప్పవాళ్ల గేట్ దగ్గర గూర్ఖానూ, ఇలా ఎవరి పని వాళ్లు చేసేటప్పుడు ప్రతివాణ్ని నేను గౌరవభావంతో చూస్తాను. ఇది మటుకు నిజం.

"చెప్పులుకుట్టే వాడితో కూడా అంత నమ్రతగా మాట్లాడాలా!" అంటుండేది మా ఆవిడ. అవును, నేను చెప్పులు మరమ్మతు చెయ్యలేనే! వాడితో నాకు పని ఉన్నదే! నేను అలా అనుకోవడం తప్పన్నారు. నేను బిచ్చగాణ్ని కాదు, బీదవాణ్నీ కాదు. నాకు ఏవైనా పనులు చేసి డబ్బులు పుచ్చుకునే వాళ్లందరినీ నేను హీనంగా చూడాలని నా హితం కోరే వారందరూ ఏకగ్రీవంగా చెప్పారు. కాని అది నాకు సాధ్యం కాలేదు.

అందరూ పెట్టే పోరు పడలేక నా జబ్బుకు ఏదన్నా చికిత్స పొందుదామనుకున్నాను. వైద్యుల నడిగితే అది మందులతో పోయే జబ్బు కాదన్నారు.

"నీది తాత్విక సంబంధమైన జబ్బు! భగవాన్ మహర్షి బాబాను ఒకసారి చూడు" అని మిత్రుడు సలహా ఇచ్చాడు" అతనికి తనపై అధికారిని చూస్తే కాళ్లు వణికేవట. భగవాన్ శ్రీమహర్షి బాబాగారు తమ ఉపదేశంతో ఆ భయాన్ని పోగొట్టారట.

మరేం? భగవాన్ గారి దర్శనం చేసుకున్నాను. ఏకాంతంలో ఆయనకు నా వ్యాధి గురించి మనవిచేశాను. ఆయన అంతా విని, "నాయనా. నీ బాధకు మూలం ఏమిటంటే నీకు జీవితంలో ఉపయోగపడే ఏ విద్యారాదు. నీలో ఏ సమర్థతాలేదు. అందుకే నీకు గోలికాయలు బాగా ఆడేవాణ్ని చూసినా గౌరవం ఏర్పడుతుంది" అన్నారు.

"స్వామి, చూసినట్టు చెప్పారు. అయితే మరి ఈ జన్మకు మోక్షం లేదాండీ?" అన్నాను.

"నీవంటి వాడికి మార్గం చూపలేకపోతే మన ప్రాచీన సంస్కృతీ అంతా వృథాయే గదా నాయనా! ఐహికంగా చిల్లిగవ్వ చెయ్యని వాళ్లను ఉత్తమొత్తములుగా చెయ్యగల ఆధ్యాత్మిక శక్తి మన పూర్వులు ఏనాడో కనిపెట్టారు. ఇంగ్లీషు వాళ్లు కనిపెట్టామనుకున్నారు గాని, వాళ్లవల్ల కాలేదు" ఏదో జ్ఞాపకం వచ్చి భగవాన్‌శ్రీగారు విరగబడినవ్వారు.

"ఒకసారి నా దగ్గరికి ఒక పెద్ద అధికారే వచ్చాడు. దొరకింద పనిచేసేవాట్ట! దొర మొహంలోకి చూడలేక పోయాడు! దొర అది గమనించి, ఆటో సజషన్ పద్ధతి నేర్పాడు. అది నీకు తెలీదా? తాపీగా కూర్చుని 'రోజు రోజుకూ, సర్వ విధాలా నేను ఇంకా గొప్పవాణ్ని అయిపోతున్నాను' అని కొంతసేపు మననం చేసుకోవాలి. అప్పుడు నీలో హిప్నోటిక్ శక్తి, పనిచేసి ధైర్యం వస్తుందని వాళ్ల ఉద్దేశ్యం. కాని నా దగ్గరికి వచ్చినవాడికిది పని చెయ్యలేదు ఎంచేతా! నువు గొప్పవాణ్నయి పోతున్నానని నమ్మొచ్చు! కాని, ఎవరికన్న గొప్పవాడివి? అర్థమయింది కదూ? మన సంప్రదాయం అది కాదు. సోహం! వాడే నేను! ఆ భగవంతుడే నేను! జపించు, నీ మనసు దేవుడి మీద కేంద్రీకరించు సోహం అని రోజూ జపించు. నువు ఎవర్నీ ఖాతరు చెయ్యవు. నీలో ఐహిక శక్తులు అట్టడుగునే వుండుగాక! ఆధ్యాత్మిక శక్తి ఉంది చూశావు? అది నిన్ను ఆకాశం ఎత్తు పెంచుతుంది."

భగవాన్ గారి సలహా అమోఘం! సోహం పని చేసింది. ఇప్పుడు నాకు అందరూ పురుగుల్లాగా కనిపిస్తారు. వెధవలు! మంగలివాడి కిమ్మత్తు రెండు రూపాయలు! అదే రెండు రూపాయలకు పెద్ద పెద్ద సినిమాస్టార్లు నాముందు, నా ఆనందం కోసం ఎన్ని పాట్లయినా పడతారు! గొప్ప సంగీత విద్వాంసుల చేత పాడించుకోగలను. గొప్ప గొప్ప రచయితలు నా కోసం చచ్చినట్టు కథలూ, నవలలూ, కవితలూ రాస్తారు.

సోహం ! సోహం ! సోహం!

*ముద్రణ : ప్రభవ, నవంబర్ 1978?*